మహిళా చైతన్యం

- ఆరోగ్య సంరక్షణ, సాధికారతే లక్ష్యంగా 'తూర్పు'లో అవగాహన కార్యక్రమాలు
- భాగస్వాములవుతున్న ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు


మహిళలతో మొక్కలు నాటిస్తున్న మ్యాజిక్ బస్ ఎన్జీవో ప్రతినిధులు



మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ బృందం, ఎన్జీవోలు

ఎంవీపీకాలనీ: మహిళల ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా తూర్పు నియోజకవర్గంలో విస్తృత కార్యక్రమాలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా మహిళా అభ్యున్నతికి బాటలు వేస్తుండగా.. ఒకపక్క ప్రభుత్వ ఉద్యోగులు.. మరోపక్క ఎన్జీవో సంస్థలు ఆయా పథకాలపై మహిళలను పెద్ద ఎత్తున చైతన్య పరుస్తున్నాయి. అత్యధిక మహిళా జనసాంద్రత కలిగిన ప్రాంతాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1 నుంచి 7 వరకు జరిగిన తల్లిపాల వారోత్సవాలతోపాటు మిషన్ శక్తి, గృహహింస, పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులు, యువతలో మెనోపాజ్ దశ ద్వారా జరిగే మార్పులు, సీజనల్ వ్యాధులు ఇలా అనేక అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

విస్తృతంగా 'మిషన్ శక్తి' సేవలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో మిషన్ శక్తి పథకం మహిళలకు విస్తృత సేవలు అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా ఎడ్యుకేషన్, ఆరోగ్య సంరక్షణ, స్వయం ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు నడిపించే కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఈ పథకంపై పెద్ద ఎత్తున అవగాహన శిబిరాలు జరుగుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్యను పెంచడంతోపాటు ఆరోగ్య పరిరక్షణ, పని ప్రదేశాల్లో లైంగికదాడుల నుంచి ఉపశమనం, మహిళలు వ్యాపారం చేసుకోవడానికి మిషన్ శక్తి ద్వారా లభించే ప్రోత్సాహం, గర్ల్ ఎడ్యుకేషన్‌కు అందించే స్కాలర్‌షిప్స్, మహిళలకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇలా అన్నింటా మహిళలను చైతన్య పరుస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

ఐసీడీఎస్, జీవీఎంసీ సంయుక్తంగా..

మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్, జీవీఎంసీ హెల్త్ డిపార్ట్‌మెంట్‌తోపాటు వాసవ్య మహిళా మండలి, మ్యాజిక్ బస్ వంటి ఎన్జీవో సంస్థల ఉద్యోగుల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తల్లిపాల వారోత్సవాల ద్వారా బిడ్డకు తల్లిపాలు అందించాల్సిన విశిష్టతను తెలియజేశారు. మహిళల భద్రతతోపాటు సీజనల్ వ్యాధులు, పర్యావరణ పరిరక్షణలో మహిళల పాత్రపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళ జనసాంద్రత కలిగిన ప్రాంతాలతోపాటు తూర్పులోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వాసవ్య మహిళా మండలి ప్రతినిధి


తల్లిపాల విశిష్టతపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఎన్జీవోలు కీలకంగా..

ఈ కార్యక్రమాలతోపాటు యువతల మెనోపాజ్ దశ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై, మహిళల్లో రక్తహీనత నివారణపై ఎన్జీవో సంస్థలు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాయి. వాసవ్య మహిళా మండలి ఎన్జీవో ఆధ్వర్యంలో కుషల్ ప్రాజెక్టు పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నగరంలోని 12 ప్రాంతాలను ఎంపిక చేసుకొని విస్తృతంగా యువతలో మెనోపాజ్ దశ, దాని పరిణామాలు, గర్భిణులు, బాలింతల పౌష్టికాహారం, మహిళలపై లైంగిక వేధింపులు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మ్యాజిక్ బస్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై మహిళలను చైతన్య పరుస్తున్నారు.

క్లుప్తంగా

జూలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


పోటీలో వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలను పోటీలకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్) జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సేఫ్టీ కోర్సులపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సురేష్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సేఫ్టీ కోర్సుల ప్రాధాన్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమర్‌రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్(తిరుపతి) సేఫ్టీ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్ఎస్ఎన్ఆర్ సురేష్ పాల్గొని విద్యార్థులకు సేఫ్టీ విభాగంలోని పలు అంశాలను వివరించారు. విపత్తుల గుర్తింపు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ విభాగం సీనియర్ మేనేజర్ మాధవ్‌కుమార్, కాలేజీ సేఫ్టీ కోర్సులకో ఆర్డినేటర్ వరహాలు పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం


అంధులకు అన్నదానం చేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

దాబాగార్డెన్స్: అందులకు సేవ చేయడంలో తృప్తి ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ అన్నారు. స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు అంధులకు అన్నదానం చేశారు. అనంతరం ఒక్కొక్కరికి 5 కేజీలు చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించి మనం ఆదుకోవాలని అన్నారు. వారికి సేవలందించడమే కాక అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

ఐక్యతతోనే గిరిజన సమస్యలకు పరిష్కారం

- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి
- ఆకట్టుకున్న గిరిజన యువతుల నృత్యాలు


సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న గిరిజన యువతులతో ఎమ్మెల్యే శిరీషాదేవి

ఎంవీపీకాలనీ: ఐక్యతతోనే గిరిజనుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ గిరిజన భవన్‌లో ఆదివారం ప్రారంభించిన వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయపరంగా గిరిజనులు ఘనసీయమైన వృద్ధి సాధించాల్సి ఉందన్నారు. దేశంలో అత్యంత వెనుకబడిన వారుగా గిరిజనులు నిలుస్తున్నారన్నారు. గిరిజనుల కోసం రాజ్యాంగంలో రూపొందించిన చట్టాల అమలులో నేటికీ వివక్ష కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో చట్టాల పరిరక్షణ, అమలుకు అన్ని గిరిజన సంఘాలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషాదేవిని నిర్వాహకులు సత్కరించారు. ఈ నెల 15 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అన్ని విధాల గిరిజనులను చైతన్యవంతులను చేయడమే ఈ వారోత్సవాలు ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా గిరిజన యువతీ యువకులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: కేంద ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.రెహమాన్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆరిలోవ జోన్ నాయకులు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఆదివారం ఆరిలోవలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంతం గురజాడ కళాక్షేత్రంలో ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుంచి 500 మంది జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, యజమానులకు అనుకూలంగా ఉండే 44 కార్మిక చట్టాలు, 4 లేబర్ కోడ్‌ల గురించి సమావేశంలో ప్రజలకు వివరిస్తారన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని కోరారు. జాతీయ సమావేశాలతోపాటు సెప్టెంబర్ 3న నగరంలోని సరస్వతి పార్కు, సెంట్రల్ పార్కు వద్ద కార్మికులతో ర్యాలీలు, ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని రెహమాన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, సీపీఐ నాయకుడు కె.లక్ష్మణరావు, ఆటో యూనియన్ నాయకులు వెంకటరావు, సూరిబాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మహాశిల్పంపై దాడి దారుణం


మాట్లాడుతున్న కొత్తపల్లి వెంకటరమణ

సీతమ్మధార: విజయవాడలో చరిత్రాత్మకంగా నెలకొల్పిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మహాశిల్పంపై పలువురు దాడి చేయడాన్ని నవయానం బహుజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. బుల్లయ్య కళాశాల దరి అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా.. దుండగులను అరెస్ట్ చేయలేదంటే అనేక అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర్ మహాశిల్పం పక్కనే పోలీస్ కమిషనరేట్, గవర్నర్ బంగ్లా, కలెక్టర్ కార్యాలయం ఉన్నప్పటికీ విగ్రహానికి రక్షణ కల్పించలేని దారుణమైన స్థితి రాష్ట్రంలో ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు కలిగిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం గానే ఈచర్యను చూడలేమని, రాజ్యాంగ నిర్మాతపై ఇదో దాడిగా భావించాలన్నారు. అంబేడ్కర్ మహాశిల్పాన్ని గత సీఎం జగన్ ఆవిష్కరించిన నేపథ్యంలో ఆయన పేరును అక్కడ పేర్కొన్నారని, అంతమాత్రాన ఇలాంటి చర్య తగదన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పెద్దలు ఈ చర్యను ఖండించకపోవడం దారుణమని మండిపడ్డారు. అంబేడ్కర్ శిల్పంతోపాటు లైబ్రరీ, పార్కు, సదుపాయాలు అక్కడ ఉన్నాయని, ఇదో చారిత్రక ప్రదేశంగా, విజ్ఞాన కేంద్రంగా మారిందని తెలిపారు. దళిత మహిళ హోం మంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం అభ్యంతరకరమని, దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ధర్మారావు, జాయింట్ సెక్రటరీ ఎస్.ఎ.రావు, సభ్యులు ఆర్.ఎస్.నారాయణ, ఎస్.నూకరాజు, వై.నూకరాజు, ఎం.అప్పారావు, పెయ్యల సిద్ధార్థ పాల్గొన్నారు.

వీరాభిమన్యు చిత్రానికి 60 ఏళ్లు

దాబాగార్డెన్స్: తెలుగు ప్రజల అందాల కథా నాయకుడు, సోగ్గాడు శోభన్‌బాబు తొలిసారి టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'వీరాభిమన్యు' 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, సిటీ వైడ్ శోభన్‌బాబు అభిమానులు కనకరాజు, రమణ, శోభన్‌బాబు, నాగరాజు, త్రిమూర్తులు, బి. కుమార్, బొట్టా ప్రసాద్, రమణ, అప్పలరాజు, దసపల్లా ప్రసాద్, హరిప్రసాద్, అప్పారావు, కొణతాల చిన్నా, నందవరపు సోములు, భానోజీరావు, జగన్, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేష్


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల వ్యవహారంపై కొత్త పోలీస్ కమిషనర్ చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. రౌడీషీటర్లు హద్దు మీరితే సీపీ వెంటనే స్పందించి నగర బహిష్కరణ చేస్తారని హెచ్చరించారు. గతంలో కూడా కొందరు రౌడీషీటర్లను గత సీపీలు నగరం నుంచి బహిష్కరించారని గుర్తు చేశారు. సమాజంలో అల్లర్లు, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సీఐ రమేష్ సూచించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఎస్ఐ జి.వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. సమాజంలో ఎటువంటి నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల దినచర్యపై ఆరా తీశారు.

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

నబ్బువరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891-2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెలమలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

దాబాగార్డెన్స్: త్వరలో కేటాయించనున్న నామినేటెడ్ పోస్టుల్లో వెలమలకు ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వెలమ సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దశాబ్దాలుగా బీసీ-డి జాబితాలో ఉన్న వెలమ కులాన్ని బీసీ-ఎ జాబితాలో చేర్చాలని కోరారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వెలమ భవనాల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని, వెలమ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వెలమ రైతులకు శతశాతం సబ్సిడీతో రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులతో భేటీ కానున్నట్లు చెప్పారు. సమావేశంలో పెదిరెడ్ల సత్యం, పెదిరెడ్ల శ్రీనివాసరావు, పైడం నాయుడు, రెడ్డి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలిసి నడుద్దాం.. ఆరోగ్యంగా ఉందాం


మాట్లాడుతున్న సీలం ఐజాక్

మురళీనగర్: వాకర్స్ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరం కలిసి నడుద్దామని వాకర్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ సీలం ఐజాక్ పిలుపునిచ్చారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్-101 పరిధిలోని వాకర్స్ క్లబ్‌ల ప్రధాన బాధ్యులతో మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో భాగంగా నడక ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వాకర్స్ క్లబ్ సభ్యులకు గురుతర బాధ్యత ఉందన్నారు. వాకర్స్ చెల్లించే సభ్యత్వ రుసుమును సేవా కార్యక్రమాలకే ఉపయోగిస్తున్నామని చెప్పారు. మరో ముఖ్య అతిథి రాళ్లపల్లి సత్యనాథం మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రతినిధులు తమ క్లబ్‌లోని సభ్యులను సమన్వయపరిచి సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని సూచించారు. డిస్ట్రిక్ట్-101 గవర్నర్ టి.రంగారావు, పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభతోపాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి 55 మంది వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు


నడక పోటీలను ప్రారంభిస్తున్న డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ రంగారావు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు రాంబాబు

కంచరపాలెం: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు వి.రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి నడక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులు డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ టి.రంగారావు, ఫౌండర్ సూర్యనారాయణ జెండా ఊపి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ నడకతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం నడకకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. జిల్లా స్థాయిలో 4 కేటగిరీల్లో 135 మంది మహిళలు, పురుషులు నడక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేస్తామని కార్యదర్శి బలరామ్ తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటరావు, జాయింట్ కార్యదర్శి ఇమ్మానియేల్, జాలీ వాకర్ రవీంద్ర బెహరా, బులెటిన్ ఎడిటర్ సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ అప్పలనాయుడు, మాజీ అధ్యక్షులు, మాజీ గవర్నర్లు ఆర్.ఆర్.మహేశ్వరరావు, టి.రాజు, సుకుమార్, సూర్యారావు, నూకరాజు, వాక్యత ఆడబాల సత్యనారాయణ, మాధవధార, మురళీనగర్, సింహాచలం, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ ప్రాంతాల నుంచి వాకర్లు పాల్గొన్నారు.

పచ్చదనం పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న సభ్యులు

కొమ్మాది: పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సంత్ నిరంకారి చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రేమ్ మీర్వాని అన్నారు. ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రుషికొండలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాలు చుట్టూ మొక్కలు నాటాలని, అప్పుడే పచ్చదనాన్ని మనం పరిరక్షించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అప్పారావు, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం అభినందనీయం


కళాకారులకు పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

సీతమ్మధార: తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు రంగాలకు చెందిన 39 మంది ప్రతిభావంతులను గుర్తించి వారికి పురస్కారాలు అందజేయడం అభినందనీయమని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రతిభ, క్రీడా, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు కళాకారులకు అతిథుల చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు స్వీకరించిన ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో మరింతగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. రెండు దశాబ్దాలకు పైగా క్రమం తప్పకుండా పురస్కారాలు అందిస్తున్న నిర్వాహకుడు అడవిరాజును అతిథులు ప్రశంసించారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యానం చేసిన సభలో చెన్నా తిరుమలరావు, సత్యప్రసాద్ శర్మ, నాంచారయ్య, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలలతో జాగ్రత్త..!







బీచ్ రోడ్డు: సరదాగా సముద్రాన్ని చూసి ఆనందించాలని వస్తున్న యువత అజాగ్రత్త వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. సెల్ఫీలు, థ్రిల్ కోసమని అలల మధ్యలో ఉన్న రాళ్లపైకి ఎక్కి ఫొటోలకు పోజులిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. అలల తాకిడికి సముద్రంలో పడటం ఖాయం. ప్రమాదమని తెలిసినా సరే యువతీ యువకులు ఆర్కే బీచ్ వద్ద ఉన్న రాళ్లపైకి ఎక్కి సందడి చేస్తున్నారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు తీరంలోని రాళ్ల పైకి ఎక్కి ఇలా సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నారు. రాళ్ల మీద కూర్చొని ఎంజాయ్ చేశారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం